క్లుప్తంగా

యువత మత్తుకు దూరంగా ఉండాలి



భీమవరం మల్టీప్లెక్స్ వద్ద ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్ ప్రదర్శన దృశ్యం

భీమవరం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు మత్తు పదార్థాలు ఆటంకం కాకూడదని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మల్టీప్లెక్స్‌వద్ద ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఫ్లాష్‌మాబ్‌నుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వలన అనేక అనారోగ్య రుగ్మతలకు గురవుతారని, మత్తు పదార్థాలు సేవించడం కారణంగా హింసకు ప్రేరేపితలవుతారని, మానసికంగా కూడా గందరగోళ పరిస్థితి ఉంటుందన్నారు. విద్యార్థుల ఫ్లాష్‌మాబ్ చూపరులను ఆకట్టుకుంది.

కృష్ణాష్టమి వేడుకల అనుమతి కోసం వినతి



భీమవరం వన్‌టౌన్ సీఐ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: ×త్రైత సిద్ధాంతం– ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించుకోడానికి అనుమతించాలని భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజును కోరారు. కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ సోమవారం సీఐ నాగరాజును కలిసి ఈ నెల 26 నుంచి మూడు రోజులుపాటు పట్టణ పరిధిలోని నరసయ్య అగ్రహారంలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా వేడుకలు నిర్వహించుకోడానికి అనుమతి కోరారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన వేదిక సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవా, చక్రధర రావు, తారకేశ్వరి, సుజాత, సత్యనారాయణ తదితరులున్నారు.

మీకోసంలో 4 ఫిర్యాదులు

ఆకివీడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ప్రజల నుంచి నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రాధాకృష్ణ చెప్పారు. ఆకివీడులోని సిద్ధాపురం రోడ్డులో చినకాపవరం డ్రెయిన్ గట్టుపై వేస్తున్న చెత్తను వేరే చోటకు మార్చి డంపింగ్ యార్డు సదుపాయం కల్పించాలని ఫిర్యాదు అందిందన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు తన గృహనిర్మాణం నిలుపుదలపై ఫిర్యాదు చేశారని తెలిపారు. స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద విద్యుత్ మోటార్లు కన్పించడం లేదని, కార్యాలయ ఆవరణలో అనుమతి లేకుండా చెట్లు నరికివేసి అమ్ముకున్నారని ఫిర్యాదు అందిందన్నారు. రాజులపేటకు చెందిన రైతు తన పొలాన్ని సరిహద్దు రైతు ఆక్రమించుకున్నాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ వివరించారు.

ఎంపీడీఓ రాధాకృష్ణకు సత్కారం

ఆకివీడు: ఎంపీడీఓ రాధాకృష్ణకు బదిలీ కావడంతో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కఠారి జయలక్ష్మి మాట్లాడుతూ రాధాకృష్ణ సేవల్ని ప్రశంసించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో చిత్తశుద్ధితో పని చేశారని కొనియాడారు. అనంతరం ఏఓ శ్రీకర్, పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, కఠారి కేశవ రావు, పలువురు సిబ్బంది రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు.

జీఓ నంబర్ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలి



ఎంఈఓలకు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ సంఘం

ఆకివీడు: ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసేందుకు మిగిలిన ఉపాధ్యాయుల్ని ఆయా ప్రాంతాల్లో సర్దుబాటు చేయడం తగదని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం స్పష్టం చేసింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారులకు నిరసన తెలుపుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పెదపూడి నాగేశ్వరరావు, ఎఎన్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ జీఓ నెం. 117, 128లను తక్షణం రద్దు చేయాలని జీఓ నెం.53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈఓపీఆర్డీకి ఎంపీడీవో బాధ్యతలు

యలమంచిలి: ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లా నుంచి ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన పి.శ్రీనివాసరావుకు మళ్లీ తిరిగి కృష్ణా జిల్లాకు బదిలీ కావడంతో సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈవోపీఆర్డీ షేక్ అమీర్ షరీఫ్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగించారు.

సమైక్యతకు నిదర్శనం త్రివర్ణ పతాకం

- కలెక్టర్ నాగరాణి
- భీమవరంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ ప్రారంభం

భీమవరం: మువ్వన్నెల జాతీయ జెండా శాంతి, సత్యం, ధర్మం, అహింస జాతీయ సమైక్యతకు నిదర్శనమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, హౌసింగ్ బోర్డు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య పక్షోత్సవాల్లో భాగంగా హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ, 400 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. పింగళి వెంకయ్య రూపకల్పన చేసిన జాతీయ జెండా దేశవ్యాప్తంగా ప్రజా చైతన్యానికి అండగా నిలిచిందని, ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా వేగరవేయలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, అధ్యక్ష, కార్యదర్శులు సరిపిడకల రామారావు, జానపాటి మధుసూదనరావు మాట్లాడుతూ జాతీయ జెండాల నిబంధనలు తూచ తప్పకుండా పాటించి భావితరాలలో దేశభక్తిని ప్రేరేపించేలా దేశభక్తిని చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో జి.నాగమణి, మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల, అసోసియేషన్ నాయకులు అల్లం రమేష్, కుక్కల బాల, సీహెచ్ సత్యనారాయణ, సూర్యనారాయణరాజు, రాంప్రసాద్, కడలి వెంకటేశ్వరరావు, కడలి ఫణి, నరహరిశెట్టి కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కాళ్ల: బీజేపీ ఆధ్వర్యంలో కాళ్లలో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయజెండాలు చేతబట్టి రాష్ట్రీయ రహదారి వెంబడి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర కాశీ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 9 నుంచి 15 వరకు ప్రతి ఇల్లు, షాపుల వద్ద జాతీయ జెండా ఆవిష్కరించి పండుగ వాతావరణంలో స్వాతంత్ర వేడుకలు చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపుమేరకు కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ జాతీయ జెండాను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్‌రాజు, ర్యాలీ జిల్లా ఇన్‌చార్జి కోమటి రవికుమార్, బీజేపీ ఉండి నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కె.వినోద్‌వర్మ, నాయకుడు బండారు సోమేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు, నాగమణి, కనకదుర్గ, కృష్ణ పాల్గొన్నారు.



భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో జాతీయ జెండా ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

వీరవాసరంలో భారీ జాతీయ పతాకంతో

వీరవాసరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా సోమవారం వీరవాసరంలో భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరవాసరం గ్రామ పరిధిలో లిటిల్ బడ్స్ స్కూలు, భారతీ పబ్లిక్ స్కూలు, డివైన్ మెర్సీ స్కూలు, వీఈసీ జూనియర్ కళాశాల, ఎస్ఎంబీటీఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్డీఏ కూటమి సభ్యులందరూ ఈ తిరంగా యాత్రలో పాల్గొని విజయవంతం చేశారు. మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కోడి నరసింహం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వినోద్ వర్మ, జెడ్పీటీసీ సభ్యులు గుండా జయప్రకాష్ నాయుడు, నాయకులు అడబాల శివ, కోమటి రవికుమార్, కురెళ్ల నరసింహరావు, జవ్వాది బాలాజీ, కొల్లేపర శ్రీనివాస్, తిరంగా యాత్ర ఇన్‌చార్జిలు సిరిపురపు నరేష్‌కుమార్, వేంద్ర దివాకర్, మద్దాల శివాజీ నగేష్ పాల్గొన్నారు.



వీరవాసరంలో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కాళ్లలో జాతీయ జెండాలతో ర్యాలీలో నాయకులు


స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



భీమవరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలో నిర్వహించే జిల్లా స్థాయి స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను ఇన్‌చార్జి ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ సోమవారం పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో 78వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ప్రధాన వేదిక, ప్రముఖులు కూర్చునే ప్రదేశాలు, స్వాతంత్ర సమరయోధుల వేదికలను ఆర్డీవో పరిశీలించారు. వేదిక వద్ద జరుగుచున్న పోలీస్ కవాతు రిహార్సిల్స్ కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వాహకులు, అధికారులకు ఆర్డీఓ పలు సూచనలు చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం సీజన్ కారణంగా వర్షాలు వచ్చే అవకాశం ఉంటుందని, వాటర్ ప్రూఫ్ టెంట్లను సిద్ధం చేయాలని సూచించారు. సీటింగ్, తాగునీటి ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఆర్ఐ కె.రాఘవమూర్తిరాజా, వీఆర్వో యాకోబు, ఈవెంట్ ఆర్గనైజర్ శేఖర్ ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



సభలో మాట్లాడుతున్న అధ్యాపకుడు ఆనందకుమార్

ఆకివీడు: గ్రంథాలయాలు విజ్ఞాన గని లాంటివని అధ్యాపకులు ఆనంద కుమార్ అన్నారు. దుంపగడపలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రిన్సిపాల్ కే.సుజాత అధ్యక్షత వహించారు. అధ్యాపకులు కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలువైన పుస్తకాల్ని చదవడం ద్వారా ఎంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మెదడుకు పదును పెట్టినట్లు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఓగేశ్వరరావు, అధ్యాపకులు కె.సామ్యూల్, లైబ్రేరియన్ వి.ఫణిరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహాలకు ముస్తాబు



స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలో పలు చోట్ల స్వాతంత్ర్య యోధుల విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. స్థానిక సాలిపేటలోని గాం. దీజీ విగ్రహానికి సోమవారం రంగులు వేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం ఈ ప్రాంతంలోని స్వాతంత్ర్యసమరయోధులు గాం. దీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రిపబ్లిక్‌డే, స్వాతంత్ర దినోత్సవం రోజు ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. స్థానిక నగర పంచాయతీ ఆధ్వర్యంలో రంగులు వేయించే కార్యక్రమం కొనసాగుతోంది. – ఆకివీడు

లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

పాలకోడేరు: మహిళలు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులను అరికట్టడంపై సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి ఆధ్వర్యంలో మోగల్లు సచివాలయంలోని మహిళా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పురుషులతోపాటు మహిళలు కూడా ప్రతి రంగంలో ముందుంటున్నారని, ఆ క్రమంలో మహిళలు పనిచేసే ప్రదేశాలలో చాలామంది లైంగిక వేధింపులకు గురవుతున్నారని, లైంగిక వేధింపులు అరికట్టాలంటే ప్రతి ఒక్క మహిళ చైతన్యం కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ఎవరైనా పని చేసే చోట మహిళలను లైంగికంగా వేధించడం గాని, అనవసరంగా తాకటం గానీ చేసినట్లయితే తోటి మహిళా ఉద్యోగులకు గాని, ఉన్నతాధికారుల దృష్టికి గాని తీసుకుని వెళ్లి వారికి తగిన గుణపాఠం చెప్పవచ్చన్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరికి చెప్పకపోవడం వల్ల నిందితులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వపరంగా పలు రకాలైన చట్టాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ భయపడకుండా తమ పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తోటి మహిళా ఉద్యోగులకు తెలియజేసి తమ హక్కులను కాపాడుకోవాలని తెలియజేశారు. సచివాలయ మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

పాలకోడేరు: మిషన్ శక్తి 100 రోజుల ప్రోగ్రామ్‌లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి ఆధ్వర్యంలో బేటి బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని సోమవారం పాలకోడేరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తెలియజేశారు. అంతేకాకుండా బాలికలకు మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. స్కూల్ విద్యార్థినులు, మహిళా టీచర్లు పాల్గొన్నారు.



పాలకోడేరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



మోగల్లు సచివాలయంలో మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అసంబద్ధ పని సర్దుబాటు తగదు

కాళ్ల: ప్రభుత్వం అసంబద్ధంగా చేయతలపెట్టిన పని సర్దుబాటును ఫ్యాప్టో మండల కమిటీ తరుపున బహిష్కరిస్తూ మండల విద్యాశాఖ అధికారికి లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేసినట్లు సంఘ నాయకులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 117 జీవోను రద్దు చేస్తామని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూస్తామని హామీలు ఇచ్చి నేడు అసంబద్ధంగా పని సర్దుబాటును చేయడం తగదన్నారు. ఈ సర్దుబాటు మండల స్థాయిలో జరగడం ద్వారా ఉపయోగం ఉంటుందని నాయకులకు తెలియజేసారు. అంతేకాకుండా ప్రతి నెల లోనూ పదోన్నతి ఇవ్వడం ద్వారా ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను తీర్చవచ్చని చెప్పారు. యూటీఎఫ్ నుంచి పట్టాభిరామయ్య, రామకృష్ణంరాజు, స్వామి, ఎస్‌టీయూ నుంచి పాపారావు, వెంకీ నాయుడు, పీఆర్‌టీయూ నుంచి కలికిమూర్తి, ఎన్‌టీఏ నుంచి సురేష్ పాల్గొన్నారు.



ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భీమవరం: ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి అన్నారు. సోమవారం ఎస్‌టీఎఫ్ఐ 25వ ఆవిర్భావం, యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా పట్టణంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎస్‌టీఎఫ్ఐ, యూటీఎఫ్ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయ రామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోపిమూర్తి మాట్లాడుతూ 117 జీఓ రద్దు చేసి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, అలాగే ప్రస్తుత విద్యా సంవత్సరంలో టెస్ట్ పరీక్షలు తెలుగు, మీడియంలో రాసేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జీవీవీ రామానుజరావు, జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య, కార్యదర్శులు సీహెచ్ కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబు పాల్గొన్నారు.



భీమవరంలో ఎస్‌టిఎఫ్ఐ, యూటీఎఫ్ పతాకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, కార్యదర్శులకు శానిటేషన్, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్, జీపీడీపీ సెక్యూరిటీ, స్ట్రీట్‌లైటింగ్ తదితర అంశాలపై మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా గ్రామాలలో డ్రెయిన్లలో నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా పూడిక తొలగించాలన్నారు. ఇళ్ల చుట్టూ, ఖాళీస్థలాల్లో ఉండే మురుగునీటిని తొలగించి ముగ్గుతో కూడిన బ్లీచింగ్‌ను చల్లించాలన్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలన్నారు. గ్రామాలలో ఇళ్ల నుంచి వచ్చే చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరుచేసేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు ఉన్నాయని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చెత్తనుంచి సంపద సృష్టించే విధంగా వర్మీ కంపోస్టు తయారు చేసి మొక్కలకు, పొలాలకు విక్రయించవచ్చన్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్తను తరలించే వాహనాలు, రిక్షాలు అందుబాటులోకి తీసుకురావలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేవిధంగా గ్రామస్తులలో అవగాహన కార్యక్రమాలు ద్వారా చైతన్యం పరిచాలన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు మార్కెటింగ్ విధానాలు, గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్య, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వెంకటరామన్, సర్పంచ్‌లు ఆరేటి సత్యవెంకట వీరాస్వామి నాయుడు, బూరబత్తుల రామ్మూర్తి, రామాని శివాజీవర్మ, బొడ్డు రేవతి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ప్రారంభం

వీరవాసరం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, పద్దుల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. సర్పంచ్‌ల అనుమానాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయసారథి, జెడ్పీటీసీ సభ్యులు గుండా జయప్రకాష్, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

మహిళలకు పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వీరవాసరం: మహిళలంతా పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ చక్కటి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని వీరవాసరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీబీవీఎల్ సరోజిని అన్నారు. వీరవాసరం ఎమ్మార్కె జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సోమవారం మిషన్ శక్తి 100 రోజుల సందర్భంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అంతా చక్కటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు కచ్చితంగా తల్లిపాలను అందించాలని, తద్వారా పిల్లల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు కచ్చితంగా ఆకుకూరలు, పప్పు ధాన్యాలు వంటి ప్రోటీన్ విలువలు కలిగిన మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తల్లిపాల ఉపయోగం పౌష్టికాహారంపై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుజాత, లక్ష్మి, నాగరత్నం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా'

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఆదేశాల ప్రకారం ఈ నెల 9 నుంచి 15 వరకూ హర్ ఘర్ తిరంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. సోమవారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని కళాశాలలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకుడు జీడీ శ్రీనివాస్, వీసీహెచ్ రమేష్, పి.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, వి.విజయలక్ష్మి, జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో

పట్టణ బీజేవైఎం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పట్టణ పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే మంగళవారం పట్టణంలో విద్యార్థులు, కూటమి నేతలతో స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుంచి జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్ఎన్ఎం కళాశాల విద్యార్థులు

యానాదులపై దౌర్జన్యాన్ని నిరసిస్తూ ధర్నా



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు, బాధిత మహిళలు

ఉండి: ఉండి యానాదుల కాలనీలో రోడ్డు పక్కన నివాసం ఉంటున్న యానాదుల ఇళ్లను తొలగించాలని దౌర్జన్యానికి పాల్పడుతూ కులంపేరుతో దూషిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే గ్రామ పంచాయితీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లకు ర్యాలీగా వెళ్లి యానాదులకు రక్షణ కల్పించాలంటూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ స్థానికంగా పంట బోదె ఆక్రమించుకుని పూడ్చి కొబ్బరిమొక్కలు నాటిన వ్యక్తి యానాదులు నివసిస్తున్న ప్రాంతంలో వారిని అక్రమంగా తరిమేసి స్థలాన్ని అక్రమించుకోవాలనే దురుద్దేశంతో వారిని కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడుతున్నాడని ఆరోపించారు. యానాద మహిళలకు రక్షణ కల్పించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. బాధిత మహిళలు కె.మావుళ్లమ్మ, కంది సీతమ్మ, సీపీఐ నాయకులు ఎం.సీతారాంప్రసాద్, సనపల శ్రీనివాస్ పాల్గొన్నారు.